


# మంచి మనసుకు

—సింహప్రసాద్

**బషీర్‌బాగ్‌లో** సిటీ బస్సు దిగి రామచంద్రరావు పదడుగులు వేశాడో, లేదో—“హలో, బ్రదర్!” అంటూ వచ్చాడొక సైకిల్‌వాలా.

ఆగాడు. అతణ్ణి ఇదివరకెక్కడా చూసినట్టు గుర్తు రాలేదు. మరి అంత చనువుగా ఎలా పిలిచాడబ్బా! అని కొంచెం ఆశ్చర్యపోతూనే ఏమిటన్నట్టు చూశాడు.

సైకిల్‌వాలా సైకిల్ దిగి, “గుడీవెనింగ్, బ్రదర్!” అన్నాడు మెల్లగా, వినయంగా.

“ఈవెనింగ్! ఏం కావాలండీ?”

“ఎక్స్‌క్యూజ్ మీ, బ్రదర్! భోజనం చెయ్యడానికి పది పైసలు తక్కువ. పది పైసలిచ్చి సాయం చెయ్యగలవా?” అన్నాడతడు తగ్గుస్వరంతో అర్థిస్తూ.

అతడు సిగ్గుతో సగం చచ్చి మరి గత్యంతరం లేక అడుగుతున్నాడని అతడి మొహం వంక చూస్తూనే అనుకున్నాడు రామచంద్రరావు. అతడి మనస్సు

జాలితో నిండిపోయింది. ఆఫ్టర్ ఆల్ పది పైసల కోసం నోరు తెరిచి యాచించవలసి వచ్చిందికదా! ఆ పది పైసలూ లేకపోతే హోటల్ వాడు భోజనం పెట్టడు కదా! అనుకునేసరికి ఎంతో బాధ కలిగింది. అతడి వంక సానుభూతిగా చూస్తూ, జేబులో చెయ్యి పెట్టి చిల్లర బయటికి తీశాడు. అందులో పది పైసల బిళ్ళలు లేవు. అయినా, చింతించకుండా అర్ధరూపాయి బిళ్ళ తీసి అందించాడు.

"అంత వద్దు, బ్రదర్! పది పైసలు చాలు, బ్రదర్!"

"ఫరవాలేదు. తీసుకోండి."

"థాంక్యూ, బ్రదర్! ఈ సారి కనిపించినప్పుడు వాపస్ ఇచ్చేస్తాను" అన్నా డతడు, అర్ధరూపాయి బిళ్ళను జేబులో వేసుకుంటూ.

"అవసరం లేదు లెండి."

"అలాగనకు, బ్రదర్! నువ్వు చేసిన సాయానికి చాలా థాంక్స్, బ్రదర్! వస్తాను, బ్రదర్!"

సైకిలు ఎక్కి వెళ్ళిపోయా డతను.

ఏనుగెక్కినట్టుగా సంబర పడ్డాడు రామచంద్ర రావు. అతడి కెంతో సంతోషంగా, తృప్తిగా, హాయిగా, ఆనందంగా, గాలిలో తేలిపోతున్నట్టుగా ఉంది.

సినీ హీరోలా సిగరెట్ కాలుస్తూ, మధ్య మధ్య ఈలవేస్తూ, కూనిరాగాలు తీస్తూ ఇంటికి వెళ్ళాడు.

"ఏమోయ్, శ్రీమతీ! ఏం చేస్తున్నావ్? ఈ వేళ సినిమాకి వెళదామా?"

"కథ జోరుగా ఉన్నట్టుందే! ఏమిటి విశేషం?" అంటూ పైట కొంగుకు చేతులు తుడుచుకుంటూ వంటింట్లోంచి వచ్చిన పద్మ—"అబ్బో! మొహం చేటంత అయిందే! ఏమిటి కథ?" అంది నవ్వుతూ.

"ఈ వేళ ఒక మంచి పని చేశానోయ్!" బూట్లు విప్పుతూ అన్నాడు.

"అంటే, రోజూ చెడ్డపనులు చేస్తున్నారా?" నవ్వును పెదాల మధ్య బంధిస్తూ అంది.

"జోక్ కాదోయ్—నిజంగానే. దానాల్లో కెల్లా దానం గొప్పదో తెలుసా?"

"విదానం." మళ్ళీ నవ్వింది.

"నవ్వుకాదోయ్. సీరియస్‌గా అంటున్నాను."

"అనండి."

"దానా లన్నింటికంటే అన్నదానం గొప్పది. అవును కదా? ఇందాకా ఏం జరిగిందంటే...బస్సు దిగి రెండడుగులు వేశానో, లేదో — 'హలో బ్రదర్!' అంటూ ఒకతను వచ్చాడు నా దగ్గరికి. అతడికో మూప్పై ఏళ్ళుంటాయిలే. చాలా అమాయకంగా ఉన్నాడు. పాపం! భోజనం చెయ్యడానికి పది పైసలు తక్కువ ఉంటే సాయం చెయ్యమన్నాడు."

"మీరు వెంటనే కరిగిపోయి ఇచ్చేశారు కదూ? మీలాంటి వాళ్ళు ఉంటారనే రకరకాల కట్టుకథ లల్లుతూంటారు. మీరు బోల్తాపడుతూంటారు."

"ఛా! మరీ దారుణంగా మాట్లాడకు. ఒక డబ్బు అడిగే సరి కెంత జాలివేసిందో తెలుసా?"

"జాలికలిగేటట్లు అడగటం వాళ్ళ ప్రత్యేకతండి."

"పనికిమాలిన కబుర్లు చెప్పకు. ఒళ్ళు మండుతుంది. అంత అవసరమైన వాడైతే పది పైసలే ఎందు కడుగుతాడు? భోజనానికని ఎందుకు అంత పెడతాడు?"

"తేలికగా నమ్మించడానికి."

"నో, నో! మరీ ఇదిగా మాట్లాడకు, పద్మా! తిండికోసం ఆఫ్టర్ ఆల్ పది పైసలు సిగ్గువిడిచి సగం చచ్చి అడిగితే కట్టు కథలంటూ తీసేసి మాట్లాడటం మంచిపని కాదు. పదిపైసలంటే ఒక సారి కాల్చి పారేసే సిగరెట్టు ఖరీదు కన్నా తక్కువే. దాని కోసం మనం అనవసరంగా ఒకర్ని అనుమానించడం అన్యాయం. కేవలం పది పైసలు తక్కువైనందువల్లే అతడు భోజనం చెయ్యలేకపోతే ఎంతటి విషాదకరమైన పరిస్థితో ఆలోచించు."

"నిజమేనండీ. మోసగాళ్ళు ఎక్కువయ్యారని అన్నాను కాని, మరో ఉద్దేశంతో కాదండీ."

"అలా అని అందరూ మోసగాళ్ళే అంటే ఇక మంచికీ, మానవత్వానికీ అర్థం ఉండదు."

"ఏదో సరదా కంటే అంత సీరియస్ అయిపోతా రెందుకండీ? మీరు చేసిన పనిని మనఃస్ఫూర్తిగా హర్షిస్తున్నానండీ."

"నీ మనసు నాకు తెలుసు, పద్మా! నే నెందుకు ఇంత ఇదిగా చెబుతున్నానంటే—ఒకసారి నా కిలాంటి అనుభవమే ఎదురయింది. అప్పుడే కొత్తగా డిగ్రీ తెచ్చుకుని, ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. ఒకసారి టెస్ట్‌కు విజయవాడ వచ్చాను. పరీక్ష లన్నీ అయ్యాక హోటల్లో కాఫీ తాగి బస్‌స్టాండుకు వెళ్ళాను. యథాలాపంగా జేబులో చెయ్యి పెట్టుకునే సరికి షాక్ తగిలినట్టు అనిపించింది. హోటల్లోకి వెళ్ళే వరకూ జేబులో ఉన్న పది రూపాయల నోటు లేదు. ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. మళ్ళీ మళ్ళీ వెదకాను. ఆ హోటల్‌కి వెళ్ళి అడిగాను. ఆ చుట్టుపక్కల కళ్ళలో కాగడాలు వెలిగించుకుని మరీ చూశాను. కాని, ప్రయోజనం లేకపోయింది. జేబులోంచి కర్చీఫ్ తీసినప్పుడో, ఎప్పుడో పోయి ఉంటుంది. పై జేబులోని చిల్లరా, కాగితాలూ లెక్క పెట్టేసరికి గుండె గుభేలుమంది. నా ఊరికి రైలు టిక్కెట్టు ఖరీదుకన్నా అయిదు పైసలు తక్కువ ఉన్నాయి. మళ్ళీ లెక్క పెట్టినా అంతే ఉంది. తెలిసి ఉన్న వాళ్ళు కనిపించక పోతారా అని చూస్తూ రైల్వే స్టేషన్‌కి వెళ్ళాను. ఎవ్వరూ కనిపించలేదు. రైలు బయలు దేరే టైమవుతూంది. ఏం చేయాలి? అయిదు పైసలే అయినా, నా కథ నమ్మి ఎవరిస్తారు? అయినా, నే నెలా చెయ్యి చాచి అడగ్గలను? చాలాసేపు పచార్లు చేశాను. తెలిసి ఉన్న వాళ్ళు కనిపిస్తే బాగుండుననీ, అయిదు పైసల బిళ్ళ దొరికితే బాగుండుననీ ఎంతో ఆశగా చూశాను. కాని, ఫలితం లేకపోయింది. ఇక తెగించి బాగా చదువుకున్న వాడులా ఉన్న ఒకతని దగ్గరికి వెళ్ళి సగం చచ్చి అర్థించాను. అతడే మన్నాడో తెలుసా? 'ఇలా అడుక్కోవడం ఈ రోజుల్లో ఫాషన్ అయిపోయింది. పాలిష్డ్ బిచ్చగాళ్ళు వీళ్ళు' అన్నాడు, హేళనగా నవ్వుతూ!"

"ఇస్తే ఇవ్వాలి, లేకపోతే మానెయ్యాలి కాని, అలా అనడం ఏం సంస్కారం?"

"కొంద రదో గొప్పగా భావిస్తారులే. అది దలా ఉంచి... అనేసరికి బిక్కచచ్చి పోయాను. ఆ తరువాత మరొక ఆలోచన వచ్చి శృంగవృక్షం దాకా టిక్కెట్టు కొన్నాను. అర్ధరాత్రి ఆ స్టేషన్లో దిగి అక్కడి నుంచి నడిచి వీరవాసరం వెళ్ళాను."

"అబ్బ!" జాలిగా చూస్తూ అంది పద్మ.


క్రొత్త
సాటిలేని
కేమలిన్
పిస్టన్ పెన్నులు
మీ సమయం వృథా కాదు.
సిరా వేసేటపుడు ఏమాత్రం ఇబ్బంది వుండదు. కేమలిన్ పిస్టన్ పెన్ను యొక్క నిర్మాణపు తీరు మీ పనిని ఎంతో సులభం చేస్తుంది.
ఒకసారి నింపండి. తేడా గమనించండి.




పిస్టన్
ఫిల్లింగ్ పెన్ను
47

ఎడమ వైపు త్రిప్పండి—గాలి బయటికి వస్తుంది.
కుడివైపు త్రిప్పండి. సిరా పూర్తిగా నిండుకొంటుంది



SI 781 Tel

"ఆ వేళటి నుంచీ ఎవరైనా కష్టాల్లో ఉన్నా మంటే కాదనలేను. మన సానుభూతిని క్యాష్ చేసు కుందామని ప్రయత్నించే వాళ్ళూ లేక పోలేదనుకో."

"అలాటి వాళ్ళు ఎక్కువ కావడం వల్లే మంచి వాళ్ళనూ, నిజంగా ఆపదల్లో ఉన్న వాళ్ళనూ కూడా అనుమానించ వలసి వస్తోంది. ఇక లేచి ముఖం కడుక్కురండి—టీ ఇస్తాను" అంటూ వంటింట్లోకి వెళ్ళింది పద్మ.

నిట్టూరుస్తూ లేచాడు రామచంద్రరావు.

అది జరిగిన పది రోజులకు రవీంద్ర భారతిలో నాటకం చూడడానికి ఉదయం పది గంటలకే వెళ్ళాడు రామచంద్రరావు. నాటకం మొదలు కావడానికి ఇంకా వ్యవధి ఉండటంతో ఆ పక్కనే ఉన్న ఇరానీ కెఫేలో టీ తాగి వద్దామని వెళుతూంటే, "హలో, బ్రదర్!" అంటూ సైకిల్‌వాలా వచ్చి అతడి పక్కన ఆగాడు.

పది రోజుల క్రితం బషీర్‌బాగ్‌లో తన దగ్గర పైసలు తీసుకున్నది ఇతడే అని అతణ్ణి చూస్తూనే గుర్తు పట్టేశాడు రామచంద్రరావు. బహుశా తనిచ్చిన లక్ష రూపాయలు తిరిగి ఇవ్వడానికి పిలిచి ఉంటాడనుకునే సరికి చాలా సంతోషం కలిగి పలకరింపుగా నవ్వాడు.

కాని, అత డదేం పట్టించుకున్నట్టు లేదు. సైకిలు దిగి, "గుడ్ మార్నింగ్, బ్రదర్! హెల్ప్ చెయ్యడానికి ఒక్క పదిపైసలు తక్కువ—కొంచెం సహాయం చెయ్యగలవా?" అనడిగాడు అచ్చం ఇదివరకట్లా ముఖం పెట్టి.

రామచంద్రరావు ఒళ్ళు మండి పోయింది. చీదరించు కుంటూ ముందుకు నడిచాడు.

అతడికి మనోవేదనగా, విసుగ్గా, అసంతృప్తిగా, కోపంగా ఉంది. భోజనానికి తక్కువ అయిందని అడుక్కుంటాడా రోగ్, ఇడియట్ అని బాధ పడ్డాడు.

మనసంతా ఏదోలా ఉండడం వల్ల నాటకం సరిగ్గా చూడలేక పోయాడు. కామెడీని ఆనందించ లేక పోయాడు.

ఇంటికి వెళ్ళగానే అంది గుమగుమలాడుతూన్న అతడి ముఖాన్ని చూసి పద్మ—"ఏమిటండీ, ముఖంలో పేలాలు వేగుతున్నాయా? సిటీ బస్సులు మాయ మయ్యాయా?"

"అదేం కాదులే కాని, మనుషులు మరీ ఘండా లంగా తయారవుతున్నారు, పద్మా! ఛఛా. మరీ ఇంతగా దిగజారిపోతారనుకోలేదు."

"అస లేం జరిగిందండీ?"

"అదే—మొన్న ఒకసారి ఎవడో భోజనానికి పది పైసలు తక్కువ అయిందని అడిగాడని చెప్పానే? అతగాడు ఈ వేళ మళ్ళీ ఎదురై మళ్ళీ అలాగే అడి గాడు. అడుక్కోవడానికి అన్నం వంకే దొరికిందా రోగ్‌కు? ఛఛా! అడుగడుగునా మోసమే కదా! ఇక మంచెప్పుడూ కల్లబొల్లి కబుర్లు విని మోస పోకూడదనిపిస్తోంది. ఏభయి పది పైసల కోసం కాదు, ఆ వంకను హాసం చేస్తున్నాడనే నా బాధ."

"అంతే నంటారా!" పరధ్యానంగా అంది పద్మ.

"అంతే. ఇంకెవళ్ళనూ నమ్మకూడదు. నమ్మడ మంటే మోసపోవడమనే అర్థం."

"మరేమో ఇందాక. . ."

"ఇందాక?" అతడి నుదురు ముడిపడింది.

"ఇందాక ఏం జరిగిందంటే నండీ-ఒక ముసలాయన వచ్చాడు, ఏడుస్తూ. అత డిక్కడి ఆసుపత్రిలో చూపించుకుందామని వచ్చాడట ఈ వూరు. ఇంతకీ తెలిసిన బంధువులు ఈ మధ్యే ట్రాన్స్‌ఫరయిందట. అది తెలియక వాళ్ళు ఉన్నారనే ధీమాతో వచ్చాడట. తీరా వచ్చాను కదా అని ఆసుపత్రిలో చూపించుకుని సిటీ బస్సులో వస్తూంటే జేబు ఎవరో కొట్టేశా రట. వాళ్ళ వూరు తిరిగి వెళ్ళడానికి డబ్బులు లేవని లబో దిబో మన్నాడు."

"మనల్ని తేలికగా బుట్టలో వేసుకోవడానికి దొంగ ఏడ్పులు ఏడుస్తార్లే. వాళ్ళను నమ్మకూడదు. అందుకు ఈ నాటి సంఘటనే ప్రత్యక్ష సాక్ష్యం."

"కానీ, పాపం! ఆ ముసలాయన మోసగాడిలా లేడండీ. తనకు ముగ్గురు మగ పిల్లలనీ, నా ఈడుదే ఒక అమ్మాయి కూడా ఉందనీ చాలా కబుర్లు చెప్పాడండీ. తన ఆస్తిపాస్తుల గురించీ, బంధు మిత్రుల గురించీ కూడా చాలా చెప్పాడండీ."

"కల్లబొల్లి కబుర్లే వాళ్ళ పెట్టుబడి మరి. సొరకాయలు కొయ్య మంటే కొయ్యరూ!."

"ఏమోనండీ, నా కలా అనిపించడం లేదు. ఆ ముసలాయన ఏడుపు వింటే కడుపులోనుంచి తీసి పెట్టాలనిపించిందంటే నమ్మండి."

"నేను నమ్మను, పద్మా! నానంటిస్తే అత డొక మోసగాడని పందెం వేస్తాను."

"మరేమోనండీ అతడు మరీ ఇదిగా అడిగితేనూ ఇరవై రూపాయ లిచ్చానండీ." భయం భయంగా అంది పద్మ.

"ఏమిటీ! ఇరవై రూపాయ లిచ్చావా?" ఎగిరి పడ్డాడు రామచంద్రరావు.

# ఉమేష్ యోగ దర్శన్




(రెండవ భాగం)
గ్రంధకర్త : యోగిరాజ్ శ్రీ ఉమేష్ చంద్రజీ
ఇంగ్లీషు లేదా హిందీ ప్రతి ధర : రు. 30/–
పోష్టేజి : రు. 5/- అదనం.
ఇది యోగం పైన బ్రహ్మాండమైన వ్యాఖ్యానం. దీనిలో ప్రాణాయామం, నిర్లిప్తత, మనస్సు కేంద్రీకరణ, ధ్యానం, సమాధిలోని వేర్వేరు దశలు, సరియైన చిత్రాలతో, సుగమంగా ఉండేశైలిలో రాయబడినది. గ్రంధకర్త యొక్క స్వానుభవంపై ఆధారపడిన యీ పుస్తకం, మీలో కుండలిని ఏ రకంగా జాగృతం చెయ్యాలో బోధపరుస్తుంది.

## శ్రీ రామ్‌తీర్థ్ యోగాశ్రమ్

దాదర్ (మధ్య రైల్వే), బొంబాయి 400 014. ఫోన్ : 442899.

Tel.(II)

క్రొత్త శీఘ్ర-చర్యగల సూపర్

# వాస్‌మోల్ 33

తెల్ల వెంట్రుకలు పూర్తిగా మరియు సహజంగా నల్లబడుతాయి.
కేవలం 3 రోజుల్లో
సూపర్ వాస్‌మోల్ 33 వైజ్ఞానిక పద్ధతిలో తయారు చేయబడిన జిడ్డులేని హెయిర్ ఆయిల్. ఇది మీ వెంట్రుకలను ఎల్లప్పటికి ఆరోగ్యంగా, నల్లగా, నిగనిగలాడేలా వుంచుతుంది.






హైజెనిక్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
పి. ఒ. బాక్స్ 1192
బొంబాయి 400 001

అన్ని కెమిస్టు దుకాణాలలో మరియు మీకు చేరువలోనున్న ప్రముఖ దుకాణాలలో లభిస్తుంది.

nationl 694 TL.

"అవునండీ. ఇంటికి వెళ్ళగానే మనియార్డరు చేస్తానన్నాడు. అడ్రసు కూడా తీసుకున్నాడు."

"తీసుకుంటాడు. తీసుకోడూ? ఫలానా ఇంట్లో ఒక అమాయకురాలుందీ, వేషం మార్చి వెళితే తేలికగా బోల్తా పడుతుందీ అని తీసుకుని ఉంటాడు." కాస్త కోపంగానే అన్నాడు.

"కష్టాల్లో ఉన్న వాళ్ళకు ఇవ్వగలిగినంత చేతి అసరా ఇవ్వాలని మీ రంటూ ఉంటారు కదా? అందుకని. . ."

"పువ్వుల్లో పెట్టి ఇరవై రూపాయ లిచ్చానంటావు. ఒకటీ, రెండూ కాదు—ఇరవై రూపాయలు! ఎవడో దారే పోయే దానయ్య వచ్చి బుడి బుడి దీర్ఘాలు తీస్తే వెనకా, ముందూ ఆలోచించకుండా ఇచ్చెయ్యడమే? అవతలి వాళ్ళు చెప్పేది నిజమా, అబద్ధమా? వాళ్ళు మంచి వాళ్ళా, మోసగాళ్ళా అని కొంచెం బుద్ధితో ఆలోచించాలి కాని, ఏడ్చాడని ఇచ్చేస్తే నెత్తిని చెయ్యి పెట్టి పోతారు."

"అతడి దుఃఖం చూస్తూంటే కడుపు తరుక్కుపోయిందండీ." నొచ్చుకుంటూ అంది.

"అందుకే అఘోరించు. మనియార్డరు చేస్తాడన్నావుగా? చేస్తాడు. చూస్తూండు." వ్యంగ్యంగా అన్నాడు.

పద్మ మరి మాట్లాడలేకపోయింది. తను నిజంగానే మోసపోయానేమోనని మథన పడింది ఆ వేళ అంతా.

ఎప్పుడూ లేనిది ఆ మరునాటి నుంచి పోస్ట్‌మన్ కోసం వీధి గుమ్మంలో నిలబడి మరీ ఎదురు చూడసాగింది పద్మ. ఆమె కెందుకో ఆ ముసలాయన తప్పకుండా పంపిస్తాడని నమ్మకంగా ఉంది. మాటి మాటికీ ఆయన విషాద వదనం కళ్ళ ముందు కదులుతూంటే—'ఛీ! అతడు మోసగాడేమిటి?' అని కొట్టి పారేసుకుంటూండేది. కాని, నాలుగు రోజులు గడిచినా, డబ్బు రాలేదు. కనీసం ఉత్తరం ముక్క కూడా రాలేదు.

"నీ మంచి ముసలాయన డబ్బు పంపించాడా?" అని రోజూ రామచంద్రరావు అడుగుతూ నవ్వుతూంటే పద్మకు రోషం, దుఃఖంకూడా కలిసి పొంగి వస్తున్నాయి. భర్త గురించి అయినా అతడు పంపితే బాగుండునని చూస్తూంటే, రోజూ నిరాశే మిగులుతూంది.

ఆమె పోస్ట్‌మన్ కోసం ఆశగా ఎదురు చూడటం చూసి అన్నా డతను: "పిచ్చిదానా! అతడి సంగతి మరిచిపో. డబ్బు కోసం ఏవో కబుర్లు చెప్పాడు. డబ్బు చేతిలో పడింది, ఉడాయించాడు. ఇక నీకు మళ్ళీ కనిపించడు. పొరపాటున కనిపిస్తే మరో కన్నీటి కథ చెప్పి మళ్ళీ చెయ్యి జాస్తాడు."

ఆమె ఏమీ అనలేక పోయింది. ముసలాయనకు డబ్బిచ్చి ఇరవై రోజులై పోయినా, అతడి నుంచి ఎలాంటి జాబూ రాకపోయేసరికి తను నిజంగా మోసపోయిందన్న నిర్ణయానికి రాక తప్పలే దామెకు. అలా అనుకునేసరికి కన్నీళ్ళు పొంగి రాగా 'ఇంకెప్పుడూ అలాటి మాటలూ, కథలూ నమ్మకూడదుగాక, కూడదు' అనుకుంది.

అయినా మరి కొన్నాళ్ళు మినుకు మినుకు మంటూన్న ఆశతో ఎదురు చూసి చూసి విసుగు చెందింది. "ఆ ముసలి వాడు నిన్ను భలేగా బుట్టలో వేశాడోయ్!" అంటూ అప్పుడప్పుడు భర్త నవ్వుతూంటే మౌనంగా భరించడం అలవాటు చేసుకుంది.

మరో నెల రోజులకు పోస్ట్‌మన్ వెంక్కొంటూ వచ్చి ఒక రిజిస్టర్డ్ లెటర్ ఇచ్చాడు పద్మకు. అప్పుడింట్లోనే ఉన్న రామచంద్రరావు "నీ కెవరు రిజిస్టర్డ్ లెటర్ పంపించా రబ్బా?" అంటూ కంగారుగా కవరు చింపాడు.

"సోదరి లాంటి పద్మగారికి సూరన్నగా రబ్బాయి ఆనందరావు నమస్కరించి వ్రాయునది ఏమనగా—సుమారు రెండు నెలల క్రితం మా నాన్నగారికి మీరు ఇరవై రూపాయలు ఇచ్చారని మా నాన్నగారు చెప్పారు. అందుకు మీకు మా కృతజ్ఞత ఎలా తెలియజేయాలో తెలియడం లేదు. ఆ వేళ మీరే కనక ఆ డబ్బు ఇచ్చి ఉండకపోతే మా నాన్నగారు మహానగరంలో ఎన్ని పాట్లు పడవలసి వచ్చేదో తలుచుకుంటే గుండె తరుక్కుపోతూంది. వెంటనే డబ్బు పంపనందుకు మీ రేమనుకుంటున్నారో తెలియదు కాని, వెంటనే డబ్బు పంపించ లేకపోయినందుకు చాలా విచారిస్తున్నాము. అందుకు మన్నించవలసిందిగా కోరుతున్నాము. అసలేం జరిగిందంటే, మీ రిచ్చిన డబ్బుతో మా నాన్నగారు హైదరాబాదు నుండి రైల్లో వస్తూంటే గుండె పోటు వచ్చింది. సహ ప్రయాణికుల అసరాతో ఎలాగో ఇంటికి వచ్చారు. కాని, మరి నాలుగు రోజులకే కన్నుమూశారు. పోయే ముందు మీ గురించి పదే పదే చెప్పారు. మీ రా డబ్బు ఇవ్వకపోతే హైదరాబాదులోనే తనకు గుండెపోటు వచ్చి ఉంటే అక్కడ కుక్క చావు చావవలసి వచ్చేదనీ, కనీసం చావువార్త కూడా ఇంటికి చేరేది కాదనీ ఎంతో విలపించారు. మీ రిచ్చిన దానికి నాలుగు రెట్లు పంపమనీ, ఎప్పటికీ మీ ఋణం తీర్చుకోలేమని వ్రాయమనీ మరీ మరీ చెప్పారు. మిమ్మల్నీ, మీ దయాగుణాన్నీ మెచ్చుకుంటూనే కన్ను మూశారు. దినకార్యాల వల్ల డబ్బు వెంటనే పంపడానికి వీలు పడింది కాదు. మా నాన్నగారి కోరిక మేరకు వంద రూపాయల డ్రాఫ్టు ఈ ఉత్తరానికి జత చేస్తున్నాము. దయచేసి ఈ డబ్బు స్వీకరించమనీ, ఆలస్యానికి మన్నించమనీ మరీ మరీ వేడుకుంటున్నాము. మీ సహాయాన్ని ఎప్పుడూ మరువలేము. మీ రీ ప్రాంతానికి వస్తే తప్పనిసరిగా మా ఇంటికి రమ్మని మా అమ్మగారూ, అక్కగారూ అంతా కోరుతున్నారు. తప్పక వస్తారని ఆశిస్తూ...

ఇట్లు

—ఆనందరావు."

ఉత్తరాన్నీ, దానికి జత చేయబడిన డ్రాఫ్టునీ చూసేసరికి రామచంద్రరావు దంపతులు కళ్ళు చెమ్మగిల్లాయి.

పద్మ కళ్ళ ముందు ముసలాయన ఆనంద బాష్పాలు రాలుస్తూ చూస్తూ నిలబడి చెయ్యెత్తి దీవిస్తున్నట్టుగా తోచింది. ★

